# సర్వర్ డౌన్.. దరఖాస్తులు జామ్

- కార్యాలయాల తరలింపు మరో కారణం
- రూ.లక్ష సాయం కోసం పడరాని పాట్లు
- విద్యార్థులకూ తప్పని తిప్పలు
- కిటకిటలాడుతున్న తహసీల్ కార్యాలయాలు
- కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందేందుకు అవస్థలు
- బీసీ రుణాలకు గడువు పెంచాలని డిమాండ్



దరఖాస్తులు నమోదు చేస్తున్న అధికారులు

**నిర్మల్‌చైన్‌గేట్:** రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతి వృత్తిదారులకు అందించే లక్ష రూపాయల రుణం కోసం అర్హులు ముప్పుతిప్పలు పడుతున్నారు. రుణం పొందేందుకు కావాల్సిన సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా పొందేందుకు లబ్ధిదారులు మీసేవా, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆదాయ, కుల, నివాసం ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ డిపార్ట్‌మెంట్ అప్లికేషన్ సైట్ ఎర్రర్ చూపెడుతూ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు. లబ్ధిదారులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. అలాగే విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో వివిధ ధ్రువపత్రాల కోసం విద్యార్థులు సైతం ఆందోళన చెందుతున్నారు.

**కార్యాలయ తరలింపు మరో కారణం..**

ఇటీవల జిల్లా కేంద్రంలో నూతన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయాలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ కార్యాలయం గత రెండు రోజుల కిందట పూర్తిగా తరలించారు. ప్రస్తుతం ఈ పాత కలెక్టరేట్ భవనంలో ఆర్డీవో, నిర్మల్ రూరల్, అర్బన్ తహసీల్ కార్యాలయాలు వచ్చాయి. దీంతో నూతన విద్యా సంవత్సర ప్రవేశాల కోసం విద్యార్థులు, బీసీ కులాల వారు కార్యాలయ చుట్టూ తిరుగుతూ ఉన్నారు.

**తహసీల్ కార్యాలయాలకు క్యూ..**

రూ.లక్ష రుణానికి దరఖాస్తు చేసుకునే వారితో పాటు విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో ప్రవేశాలు, ఇతర పరీక్షల నిమిత్తం విద్యార్థులు కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయాల బాట పట్టడంతో కిటకిటలాడుతున్నాయి. వందలాది దరఖాస్తులు రావడంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతోంది.

**పైరవీలకు ప్రాధాన్యం...**

సామాన్యులు వీటిని అందుకునేందుకు అపసోపాలు పడుతుంటే పైరవీకారులు తమ ప్రాబల్యం చూపిస్తున్నారు. కొంతమంది దళారీలుగా అవతారమెత్తి ఒక్కరోజులో ప్రక్రియను ముగించుకుని కోరిన ధ్రువపత్రాన్ని చేతిలో పెడుతున్నారు. ఇందుకోసం ఒక్కో పత్రానికి రూ.1,000– 1,500 వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

### నాలుగు రోజులుగా తిరుగుతున్న..



నాలుగు రోజుల కింద తమ కుమారుడి ఆదాయం, కులం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేశాను. ఎప్పుడు వచ్చిన సైట్ పనిచేయడం లేదంటున్నారు. త్వరగా సర్టిఫికెట్లు అందించాలి.

– ఎంగులు, పొట్టపెల్లి, లక్ష్మణచాంద

### వందల సంఖ్యలో ధరఖాస్తులు...



లక్ష్మణచాందలోని మీసేవా కేంద్రంలో..

**లక్ష్మణచాంద/తానూర్:** మీ సేవా సర్వర్ పనిచేయకపోవడంతో తహసీల్దార్ కార్యాలయాల చుట్టు లబ్ధిదారులు తిరుగుతున్నారు. లక్ష్మణచాంద మండలంలో నాలుగు రోజుల్లోనే కులం 549, నివాసం 71, ఆదాయం 809 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని సిబ్బంది చెబుతున్నారు. జిల్లా మొత్తం ఓవర్ లోడ్‌తో మీ సేవా సైట్ పనిచేయడం లేదని, దీంతో ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. దీనిపై డెప్యూటీ తహసీల్దార్ గంగాధర్‌ను సంప్రదించగా మొత్తం సర్వర్ డౌన్‌గా ఉందని తెలిపారు.

### కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న



ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయానికి దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు కావాలంటూ ఈ నెల 8న మీ–సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. నేటికి ధ్రువపత్రాలు జారీ కాలేదు. రోజు పనులు వదులుకొని కార్యాలయం చుట్టూ తిరుగుతున్న.

–విజయ, బంగల్‌పేట్

### బీసీ రుణాలకు గడువు పెంచాలి..



కుల, ఆదాయం ధ్రువీకరణ పత్రాల కోసం బీసీలు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. పనులు మానుకుని మీసేవ కేంద్రాలు, తహసీల్ చుట్టూ తిరగాల్సి వస్తోంది. సాంకేతిక సమస్యలతో ధ్రువపత్రాలు సకాలంలో అందడం లేదు. బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి. –సంధ్య రాణి, నిర్మల్

### మొరాయింపుతో ఇబ్బంది...



ఆన్‌లైన్ సర్వర్ సరిగా పనిచేయక కొంత సమస్య ఉంది. సర్వర్ రాకపోవడంతో పాటు తహసీల్దార్ కార్యాలయాన్ని పాత కలెక్టరేట్ భవనానికి షిఫ్ట్ చేయడంతో సకాలంలో పత్రాల జారీ చేయలేకపోతున్నాం. సర్వర్ పనిచేసే సమయంలో వెంటనే పత్రాలు జారీ చేస్తున్నాం.

– సుభాష్ చందర్, తహసీల్దార్, నిర్మల్ అర్బన్

# తండాల్లో గిరిజనోత్సవం



కుభీర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి



సోన్: సాకేర గ్రామంలో పాల్గొన్న జెడ్పీ సీఈవో



పెంబి: నాగాపూర్ జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

**జీపీలు చేసిన ఘనత కేసీఆర్‌దే..**

**పెంబి:** సీఎం కేసీఆర్ పాలనలో తండాలు, గూడాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం మండలంలోని నాగాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఖానాపూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శంకర్, సర్పంచ్ బోసు సునీత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జీపీ భవనాలకు ఎమ్మెల్యే భూమిపూజ..**

**కుభీర్:** మండలంలో పలు తండాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి భూమిపూజ చేశారు. సర్పంచులు రోహిదాస్, శాంతాభాయి, త్రిభాయి, మాజీ సర్పంచులు దత్తురాం, హన్మండ్లు దత్తుగౌడ్, దేవేందర్, ఎంపీటీసీ శ్యాంరావ్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంఖర్, బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్ ఉన్నారు.

**లక్ష్మణచాందలో..**

**లక్ష్మణచాంద:** మండలంలో జెడ్పీటీసీ సభ్యులు రాజేశ్వర్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేష్, ఎంపీడీవో శేఖర్, ఎంపీవో నసీరుద్దిన్, సర్పంచ్ పూలవతి, రాచాపూర్ ఉపసర్పంచ్ ముత్యం పాల్గొన్నారు.

**సోన్:** మండలంలోని సాకేర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి జెడ్పీసీఈవో సుధీర్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఐటీడీఏ స్పెషల్ అధికారి అరవింద్, ఇన్‌చార్జి ఎంపీడీవో మోహన్‌రెడ్డి, ఎంపీవో ఖలీం, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, సర్పంచ్ సుప్రజా, ఉప సర్పంచ్ సతీష్‌రావు ఉన్నారు.

**సేవాలాల్‌తండాలో..**

**లోకేశ్వరం:** మండలంలోని సేవాలాల్‌తండాతో పాటు అన్ని గిరిజన తండాల్లో దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ యశోదబాయి, ఎంపీటీసీ సభ్యుడు దత్తురాం పటేల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.

**జీపీ భవనానికి భూమిపూజ..**

**తానూరు:** మండలంలోని ఝరి(బి)తండా, బామ్ని తండా, హిప్నెల్లితండా, కోలూరు తండాల్లో జీపీ భవనాల నిర్మాణాకి భూమిపూజ చేశారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, ఎంపీడీవో శ్రీనివా స్‌రావ్, సర్పంచ్ తాన్‌సింగ్, ఎంపీవో మోహన్‌సింగ్ ఉన్నారు.

**నిర్మాణ పనులు ప్రారంభం..**

**మామడ:** మండలంలోని తోటిగూడ, జయరాంతండా, గాయిద్‌పల్లి గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు శనివారం భూమి పూజ చేశారు. ఎంపీపీ అమృత, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి ఉన్నారు.

**అంబకంటితండాలో..**

**కుంటాల:** మండలంలోని అంబకంటితండాలో తండా నాయక్ నారయణ్, కారోబారి రమేష్, పటేల్ రవీందర్‌ను అధికారులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ శంకర్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

**తండాల్లో..**

**దస్తురాబాద్:** మండలంలోని మున్యాల తండా, ఎర్రగుంట గ్రామంలో ఉత్సవం నిర్వహించారు. సర్పంచులు బిల్‌సింగ్, సురేష్‌నాయక్, ఎంపీడీవో భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్ ఉన్నారు.



కుంటాల: సన్మానిస్తున్న అధికారులు

**గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట**

**ఖానాపూర్:** గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ అబ్దుల్ మోహిద్ అన్నారు. శనివారం మండలంలోని సేవ్యానాయక్ తండాలో గిరిజన ఉత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మల్లేశ్, ఎంపీవో చంద్రశేఖర్, సర్పంచ్ గుగ్లావత్ రమేష్, హెచ్‌ఎం వెంకట్రావు, కార్యదర్శి నాగరాజు, నాయకులు లక్ష్మణ్‌నాయక్, గంగాధర్, శోభ, కమల, లలిత ఉన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అలెగ్జాండర్

**కడెం:** గ్రామల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ అలెగ్జాండర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణను అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఉద్యాన, సెరికల్చర్ క్లస్టర్ అధికారి సాదుల మౌనిక మాట్లాడుతూ సంపద్రాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ఫాం, మల్బరీ సాగు చేపట్టాలని, వీటికి ప్రభుత్వం అనేక రాయితీలను అందజేస్తున్నట్లు తెలిపారు. పలువురు వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆత్మ కమిటి చైర్మన్ సతీశ్, ఎంపీవో ఉపేందర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ ఉన్నారు.

# ఆదాయ, కులధ్రువ పత్రాల కోసం ఆందోళన



తహసీల్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

**ఖానాపూర్:** బీసీ కులవృత్తుల సాయం, విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అవసరమయ్యే ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందడం లేదని పట్టణంతో పాటు మండలానికి చెందిన పలువురు బాధితులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసి పదిరోజులు కావస్తున్నా అధికారులు ప్రతీ రోజు సాకులు చెబుతూ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు పలుకుబడి ఉన్నవారు, రాజకీయ నాయకులకు మాత్రం వెనువెంటనే జారీ చేస్తున్నారని ఆగ్రహించారు. ఈ విషయమై తహసీల్దార్ రాజమోహన్‌ను వివరణ కోరగా రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ సమస్యతో పనులు సకాలంలో కావడం లేదని పేర్కొన్నారు.

# అందుబాటులో విత్తనాలు, ఎరువులు

**తానూరు:** మండల కేంద్రమైన తానూరుతో పాటు జౌలా(బి) గ్రామాల్లోని వ్యవసాయ గోదాంలో సోయా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నట్లు హంగిర్గా సొసైటి బ్యాంక్ సీఈవో భూమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు, ఎరువులు కావాల్సిన రైతులు పట్టాపాసు పుస్తకాలు తీసుకువచ్చి కావాల్సిన ఎరువులు తీసుకెళ్లాలని సూచించారు.

### రామాలయానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద స్థానికులు

**లక్ష్మణచాంద:** మండల కేంద్రంలో రామాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కవితరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మంత్రి ఐకేరెడ్డి నిధులు మంజూరు చేశారని, స్థలం గ్రామానికి చివర ఉండటంతో ఇబ్బందిగా ఉందని, ఊరు ప్రారంభంలో స్థలం కేటాయించాలని కోరారు.

# గ్రామాల్లో డీఆర్‌డీవో తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

**భైంసారూరల్:** మండలంలోని ఎగ్గాం, పేండ్‌పల్లి గ్రామాలను శనివారం డీఆర్‌డీవో విజయలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం, రూఫ్‌టాప్, కిచెన్ గార్డులు, ఇంకుడుగుంతల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పేండ్‌పెల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులు, గర్భిణులతో మాట్లాడారు. కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఈజీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



తర్లపాడ్‌లో కుటుంబాన్ని పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

**ఖానాపూర్:** పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన కావేటి శిరీష–శివ దంపతుల కుమారుడు అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు, మంత్రి కేటీఆర్ మిత్రుడు బుక్యా జాన్సన్‌నాయక్ వారి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. గతంలో ఆ బాలుడి వైద్య ఖర్చులకు రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందజేశారు. పుట్టుకతోనే గుండె సంబంధిత వ్యాధితో జన్మించిన బాలుడికి దాతల సాయంతో ఆపరేషన్ నిర్వహించారు. అయినప్పటికీ నెల రోజుల క్రితం మృతిచెందాడు. అనంతరం తర్లపాడ్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పాలకుర్తి లక్ష్మన్ కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పాత ఎల్లాపూర్ ఒడ్డెవాడకు చెందిన ఒడ్డెర సంఘం నాయకులు జాన్సన్‌నాయక్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగారపు శ్రావణ్, కాలేరి దివాకర్, పాల సంతోష్, బూసి నరేందర్, బలగం రమేష్, ఎర్ర గంగన్న, సాబిర్, మజర్, షఫీ, ఎర్రన్న, గంగాసాగర్, ధరంపురి, ఏనుగుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హరితోత్సవంపై వ్యాసరచన పోటీలు

**నిర్మల్‌రూరల్:** దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 19న నిర్వహించే తెలంగాణ హరితోత్సవం కోసం అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సోఫీ నగర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 19వ తేదీన తెలంగాణ హరితోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని డీఈవో రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ సిరడి గంగాశంకర్, కవులు వెంకట్, తోడిశెట్టి పరమేశ్వర్ పాల్గొన్నారు.

### హరితోత్సవం విజయవంతం చేయాలి

**ముధోల్ :** ఈ నెల 19వ తేదీన నిర్వహించే హరితోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రం ముధోల్‌లోని నర్సరీని పరిశీలించారు. సందర్భంగా మొక్కలను పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శిరీష రెడ్డి, ఉప సర్పంచ్ సంజీవ్, ఉపాధిహామి, టెక్నికల్ అసిస్టెంట్లు ఉన్నారు.

### 'రూ.లక్ష సాయం గడువు పెంచాలి'

**కడెం:** ప్రభుత్వం బీసీలకు అందజేయనున్న లక్ష సాయం దరఖాస్తు గడువు పెంచాలని పెంబి జెడ్పీటీసీ భుక్యజానుబాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొన్నికులాలకే కాకుండా బీసీలందరికీ సాయం అందించాలని తెలిపారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్, కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు గంగాధర్, నాయకులు భూమ రెడ్డి, తిరుమల్, రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

### ఓటరు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలి

**కుంటాల:** ఓటరు నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నరేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు ఓటరు నమోదు అవకాశం ఉన్నందున బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ ఏడాది అక్టోబర్ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించేలా దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

**ఓటరు నమోదు చేసుకోవాలి**

**ఖానాపూర్:** 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు గుర్తింపు కార్డు కోసం ఓటరు నమోదు చేయించుకోవాలని బీఎల్‌వోలు చందురాణి, వరలక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీరాంనగర్, శివాజీనగర్ కాలనీల్లో వేర్వేరుగా పర్యటించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ శోభారాణి, మాజీ వార్డు సభ్యుడు చంద్రహాస్, నాయకులు వంశీ ఉన్నారు.

### న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

**పెంబి:** మండలంలోని తాటిగూడ, ఇటిక్యాల్, కోసగుట్ట, షెట్‌పల్లి గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సును మండల సేవ సంస్థ చైర్మన్, ఖానాపూర్ జూనియర్ సివిల్ జడ్జి జీతిన్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జడ్జి జీతిన్‌కుమార్ మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన ఉండాలని తెలిపారు. చట్టాన్ని తమ చేతిలోకి తీసుకోవద్దని, గిరిజనులకు న్యాయపరమైన సమస్యలు ఉంటే మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్, న్యాయవాదులు వెంకట మహేంద్ర, రాజశేఖర్, శివ, రాజలింగం, వెంకటేష్, సురేష్, పోలీస్ ఉన్నారు.

### ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న లక్ష్మణ్

**కుంటాల:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఆనందిత ఫౌండేషన్ చైర్మన్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రణీత పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో బడిబాటలో భాగంగా విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు భవిష్యత్ ప్రణాళికలపై అవగాహన కల్పించారు. పదోతరగతిలో పదికి పది జీపీఏ మార్కులు సాధించిన కీర్తన, 9.7 జీపీఏ సాధించి గంగోత్రిలను సన్మానించారు. సర్పంచ్ కదం భోజాబాయి, హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయులు ఉమారాణి, అఖిల, ప్రియాంక పాల్గొన్నారు.

### రెడ్డిక సంఘ భవన నిర్మాణానికి నిధులివ్వాలని వినతి



మంత్రికి పూల మొక్క అందిస్తున్న సభ్యులు

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో బేస్తవార్‌పేట్ కాలనీలోని రెడ్డిక సంఘ సభ్యులు శనివారం మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డిక సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ ఎడపెల్లి నరేందర్ పాల్గొన్నారు.

### క్యాంప్‌లో ఖానాపూర్ కౌన్సిలర్లు



క్యాంప్‌లోని కౌన్సిలర్లు

**ఖానాపూర్:** అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఖానాపూర్ పట్టణంలో మున్సిపల్ రాజకీయాలు రసవత్తరగా సాగుతున్నాయి. మున్సిపల్ నూతన పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు కావడంతో చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాస ప్రక్రియ ఊపందుకుంది. కొన్ని నెలలుగా అవిశ్వాస ప్రక్రియపై సమాలోచనలు చేసిన కౌన్సిలర్లు ఎట్టకేలకు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి అవిశ్వాసం నోటీసులు ఇచ్చారు. ఈ విషయమై పలుమార్లు వార్షిక బడ్జెట్ సమావేశాలను సైతం కౌన్సిలరుల బైకాట్ చేశారు. తాజా అవిశ్వాసంతో ఖానాపూర్ రాజకీయాలు వేడెక్కాయి. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన 9 మంది అవిశ్వాసానికి తెరలేపారు.

**నేరుగా క్యాంప్‌నకు..**

అవిశ్వాస విషయమై కలెక్టర్‌కు విన్నవించిన అనంతరం అక్కడి నుంచి నేరుగా క్యాంపునకు తరలివెళ్లారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం ఆధ్వర్యంలో తరలివెళ్లిన కౌన్సిలర్లు నూతన చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికపై సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. అవిశ్వాసం పెట్టిన వారిలో నల్గురు బీఆర్‌ఎస్, నల్గురు కాంగ్రెస్, ఒక బీజేపీ కౌన్సిలర్ ఉన్నారు. ఈ క్రమంలో ప్రస్తుత చైర్మన్, వైస్‌చైర్మన్ తీసుకునే నిర్ణయంపైనే అందరి దృష్టి పడింది. అవిశ్వాస తీర్మానంపై కోర్టుకు వెళ్తారా లేక పదవులకు రాజీనామా చేస్తారా అన్న చర్చ జరుగుతోంది. స్థానిక ఎమ్మెల్యే సైతం ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో గమనార్హం.

### 'అక్రమ పట్టా రద్దు చేయాలి'



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**భైంసాటౌన్:** మండలంలోని హంపోలి గ్రామంలో అక్రమ పట్టా రద్దు చేసి పేదలకు ఆ స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. హంపోలి గ్రామంలో ప్రభుత్వం 1983లో సర్వే నం 16లో 4.37 ఎకరాల స్థలాన్ని పేదలకు కేటాయించిందని, ధరణిలో సదరు స్థలాన్ని అక్రమ పట్టా చేశారని ఆరోపించారు. దీంతో అక్రమపట్టా రద్దు కోసం గ్రామ ప్రజలు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా పట్టా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి హరిత, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు దీనాజి, విఠల్, అనిల్ ఉన్నారు.